సాక్షి అనకాపల్లి

ఆదివారం । 14 । జనవరి । 2024



ఏలేరు కాలువపై ఐరన్ గ్రిల్స్

ఏలేరు కాలువ గట్టుపై ప్రయాణించే వారికి ప్రమాదాలు జరగకుండా రెండు ప్రాంతాల్లో ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. IIలో



అస్థికలు కలిపి వస్తూ.. IIలో

నదిలో అస్థికలు కలిపి తిరిగి ఇంటికి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.



విద్యుత్తు వెలుగులు IIలో

అనకాపల్లి సుంకరమెట్ట కూడలి వద్ద ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను మంత్రి అమర్‌నాథ్ ప్రారంభించారు.

న్యూస్‌రీల్

భోగభాగ్యాలు కలిగించాలి



మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి: సంక్రాంతి పండగ అందరికీ భోగభాగ్యాలుకలిగించాలని, ప్రజల జీవితాలు మరింత సుఖమయం కావాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ఆయన ప్రజలకు శుభాకాంక్షలు చెప్పారు. రాష్ట్ర ప్రజలందరికీ అన్ని విధాల మంచి చేకూరాలని ఆకాంక్షించారు.

కిక్కిరిసిన అనకాపల్లి రైల్వే స్టేషన్



రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

అనకాపల్లి: పండగ ప్రయాణికుల రద్దీతో పట్టణంలోని రైల్వే స్టేషన్, ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ) డిపో కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికులతో ఇక్కడ శనివారం సందడి కనిపించింది. ఉద్యోగరీత్యా పొరుగూళ్లలో నివాసముంటున్న వారు కుటుంబ సమేతంగా స్థానిక రైల్వే, బస్‌స్టేషన్‌లో దిగి వారి వారి స్వగ్రామాలకు వెళ్లారు. గుంటూరు, విజయవాడ, కాకినాడ, హైదరాబాద్ తదితర నగరాల నుంచి సంక్రాంతి పండగకు బయలుదేరడంతో ఇటు రైళ్లు అటు బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణంలో దిగి బస్సుల ద్వారా పల్లెలకు చేరుకున్నారు. ప్రయాణాలకు రైలు, బస్సు రిజర్వేషన్లు దొరకనివారంతా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. ఏడాదికొకసారిగా వచ్చే పండగకు ఎలాగైనా స్వగ్రామాలకు చేరుకోవాలనే ప్రయాణికుల ఆతృతను ట్రావెల్స్ క్యాష్ చేసుకున్నాయి. రూ.500 టిక్కెట్ వద్ద అమాంతంగా రూ.700 పెంచి దోచుకున్నారనే చెప్పాలి. దూరాన్ని బట్టి టికెట్ ధర నిర్ణయించి ట్రావెల్స్ బస్సులు నాలుగు కాసులు వెనకేసుకున్నాయి. ట్రావెల్స్ నమ్ముకున్న ప్రయాణికులకు మరో భంగపాటు ఎదురైంది. ట్రావెల్ బస్సులన్నీ పట్టణంలో రాకుండా జాతీయ రహదారిపై దించేయడంతో వారు మళ్లీ ఆటోలను ఆశ్రయించి నగదు చెల్లించి బస్టాండ్‌కు చేరుకోవాల్సి వచ్చింది. ఎలాగైతేం తమ స్వగ్రామాలకు చేరుకున్నామన్న ఆనందం వారిలో కొట్టొచ్చినట్టు కనిపించింది.

కన్నీటి గాథ.. నాటకానికి కథ IIలో

సీఎం జగన్ సహకారంతో
సర్వతోముఖాభివృద్ధి

- దేవరాపల్లిలో రూ. 46.32 కోట్లతో 102 పనులు
- ఊహించని విధంగా మారిన మండల కేంద్రం రూపురేఖలు
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో చరిత్రలో చిర స్థాయిగా నిలిచేలా అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్టు డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు తెలిపారు. దేవరాపల్లిలోని రెండు సచివాలయాల పరిధిలో నాలుగు రోజులుగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటా పర్యటించిన ఆయన ఆఖరి రోజు శనివారం రైవాడ అతిథి గృహంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. దేవరాపల్లి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నాలుగున్నరేళ్లలోనే రూ.46.32 కోట్లతో 102 అభివృద్ధి పనులు నిర్వహించినట్టు చెప్పారు. వీటిలో దాదాపుగా 90 శాతం మేర పూర్తి చేసినట్టు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో దేవరాపల్లి అభివృద్ధి పూర్తి కుంటుపడిందన్నారు. స్థానిక ప్రజావసరాలపై పూర్తి అవగాహన కలిగిన నాయకుడిగా పక్కా ప్రణాళికలతో స్థానిక ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, సర్పంచ్, ఎంపీటీసీ తదితర ప్రజాప్రతినిధులు, ప్రజల సలహాల, సూచనలతో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఒక పక్క సంక్షేమ పథకాలతో పాటు మరో పక్క అభివృద్ధి పనులను సమ ప్రాధాన్యత ఇచ్చి యజ్ఞలా చేపట్టడంపట్ల అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతల ముఖా ల్లో ఆనందం స్పష్టంగా కనిపించిందన్నారు. దేవరాపల్లిలో రూ.7కోట్లతో ఆరు తారు రోడ్లు, రూ.6.72 కోట్లతో 52 సీసీ రోడ్లు, రూ.56 లక్షలతో 4 సీసీ డ్రైనేజీలు నిర్మించామన్నారు. రూ.14 కోట్లతో దేవరాపల్లి- కొత్తవలస ఆర్‌అండ్‌బీ తారు రోడ్డు, దేవరాపల్లి నుంచి రైవాడ జలాశయం వరకు రూ.1.20 కోట్లతో తారురోడ్డు నిర్మించినట్టు చెప్పారు. రూ.2 కోట్లతో అధునాతన హంగులతో నూతన ఎంపీడీవో భవనం, రూ.కోటితో పార్కు నిర్మాణంతో పాటు 60 లక్షలతో ఆర్టీసీ కాంప్లెక్స్ ఆధునికీకరించామని ఆయన చెప్పారు. దేవరాపల్లి పీహెచ్‌సీని రూ.50 లక్షలతో ఆధునికీకరించడంతో పాటు రూ.1.70 కోట్లతో అదనపు భవనం నిర్మిస్తున్నామన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో రూ. 5.64 కోట్లతో 2 లక్షల లీటర్లు, లక్షా 50 వేలు లీటర్ల సామర్థ్యంగల రెండు భారీ ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణంతో పాటు ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి సదుపాయం కల్పిస్తున్నామన్నారు. శివారు గ్రామాలైన ముత్యాలమ్మపాలెం, అల్లిపురం, బంగారమ్మ పాలెంలో సైతం కొత్త ట్యాంక్‌లు నిర్మిస్తున్నామన్నారు. అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం జగన్‌కు స్థానిక ప్రజల తరఫున డిప్యూటీ సీఎం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈయన వెంట ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరీ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, మండల అధ్యక్షుడు బూరె బాబురావు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వి. సింహాచలంనాయుడు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, రైవాడ మాజీ సర్పంచ్ చల్లా తాతయ్యలు, బంధం అప్పలరాజు పాల్గొన్నారు.

చెరకు బకాయిల గ్రాంట్ రూ.12.30 కోట్లు విడుదల

- సంక్రాంతి సెలవులనంతరం రైతుల ఖాతాల్లో జమచేస్తాం
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



ధర్మశ్రీని సత్కరిస్తున్న రైతులు, కార్మికులు

చోడవరం: గోవాడ రైతులకు చెరకు బకాయిలు చెల్లించేందుకు రూ.12.30 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని, ఆ సొమ్మును ఫ్యాక్టరీ ఖాతాలో జమచేసిందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శనివారం చెప్పారు. చోడవరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత సీజన్‌కు సంబంధించి చెరకు రైతులకు రూ.7.11 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని, అదేవిధంగా కార్మికులకు బకాయిలు మరో రూ.5 కోట్లు కూడా చెల్లించాల్సి ఉందన్నారు. ఫ్యాక్టరీ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో ప్రభుత్వాన్ని గ్రాంట్‌గా ఇమ్మని కోరామని ధర్మశ్రీ చెప్పారు. రైతుల కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మొత్తం రూ.12.30 కోట్లు గ్రాంట్‌గా మంజూరు చేశారని, ఆ సొమ్ము శుక్రవారం రాత్రి గోవాడ ఫ్యాక్టరీ ఖాతాలో జమ అయిందన్నారు. సంక్రాంతి సెలవులు కావడంతో రైతుల ఖాతాల్లోకి జమచేయడానికి వీలుకాలేదని, బ్యాంక్ సెలవుల అనంతరం నేరుగా రైతుల ఖాతాల్లోకి బకాయిలు జమచేయనున్నట్టు చెప్పారు. ఫ్యాక్టరీ కార్మికులకు రూ.2కోట్ల జీతభత్యాలు, పదవీ విరమణ చేసిన కార్మికులకు చెల్లించాల్సిన మరో రూ.2కోట్ల బకాయిలు కూడా వెంటనే చెల్లిస్తామన్నారు. ఫ్యాక్టరీ నిర్వహణ కోసం మరో రూ.కోటి ఖర్చుచేయాలని ఇప్పటికే అడ్మినిస్ట్రేటివ్ ప్రతిపాదనలు ఉండడంతో వాటికి ఖర్చుచేస్తారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన గ్రాంట్ రూ. 12.30 కోట్లతో పాటు ఫ్యాక్టరీ సరఫరా చేసిన విద్యుత్‌కు సంబంధించి ట్రాన్స్‌కో నుంచి రావలసిన రూ.50 లక్షలు కూడా ఆ శాఖ విడుదల చేసిందని ధర్మశ్రీ చెప్పారు. ఈ నిధులు మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి సహకరించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్‌కు ధర్మశ్రీ కృతజ్ఞతలు తెలి పారు. గ్రాంటు విడుదలకు కృషి చేసిన ఎమ్మెల్యే ధర్మశ్రీని రైతులు సత్కరించారు. ఫ్యాక్టరీ గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు భాస్కరరావు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

అంబరాన్నంటిన ముందస్తు సంబరాలు

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలో శనివారం ముందస్తుగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. బీరకవీధిలో నిర్వహించిన వేడుకల్లో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భోగి మంటను వెలిగించి సంబరాలను ప్రారంభించారు. స్థానిక చిన్నారుల కోలాటం ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరదపురెడ్డి లలితానాయుడు, కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ వి.సింహాచలంనాయుడు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



దేవరాపల్లిలో భోగి మంట వద్ద డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

సంక్రాంతి వేళ మహాలక్ష్మి !

- మహాలక్ష్మి పథకంతో హైదరాబాద్‌లో తగ్గిన ఆర్టీసీ బస్సు సర్వీసులు
- అందుకనుగుణంగా అటు నుంచి బస్సులను పెంచిన మన ఆర్టీసీ
- గత సంక్రాంతికి ఉత్తరాంధ్ర నుంచి 450 సర్వీసులు
- ఈసారి ఆ సంఖ్య 650 వరకు పెంపు
- వీటిలో అధికంగా హైదరాబాద్ నుంచి నడుపుతున్న అధికారులు
- సమన్వయం కోసం ఆర్టీసీ ప్రత్యేక అధికారుల నియామకం



బస్సు కాంప్లెక్స్ వద్ద ప్రయాణికుల కిటకిట

సాక్షి, విశాఖపట్నం: తెలంగాణలో మహాలక్ష్మి పథకం సంక్రాంతి వేళ ఏపీఎస్‌ఆర్టీసీకి కాసులు కురిపిస్తోంది. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం ఇటీవల మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో ఆ రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో అక్కడ ప్రయాణికుల అవసరాలను తీర్చడానికి ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో మునుపటిలా ఈ సంక్రాంతి పండగకు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ దూర ప్రాంతాలకు తగినన్ని స్పెషల్ బస్సులను నడిపే అవకాశం టీఎస్‌ఆర్టీసీకి లేకుండా పోయింది. దీనిని ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు అవకాశంగా మలుచుకున్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఎక్కువ బస్సులను నడుపుతున్నారు. ఇలా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి తదితర దూర ప్రాంతాలకు మరిన్ని బస్సులను తిప్పుతున్నారు. గత సంక్రాంతికి ఉత్తరాంధ్ర నుంచి 450 స్పెషల్స్ తిప్పగా, ఈ సంక్రాంతికి ఆ సంఖ్య దాదాపు 650 వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. వీటిలో హైదరాబాద్ సర్వీసులే 150 వరకు ఉంటాయని చెబుతున్నారు. ఏటా సంక్రాంతి పండుగకు తెలంగాణలోని హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు పెద్ద సంఖ్యలో జనం వస్తుంటారు. వీరిని దృష్టిలో ఉంచుకుని ఈనెల 10వ తేదీ నుంచి 14 వరకు, తిరిగి 17 నుంచి 22 వరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. 10 నుంచి 14 వరకు హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు స్పెషల్స్‌ను అందుబాటులో ఉంచుతున్నారు. సంక్రాంతి తర్వాత 17 నుంచి 22 వరకు ఉత్తరాంధ్ర నుంచి హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి వైపు నడిపేందుకు నిర్ణయించారు.

80 శాతం ఓఆర్

హైదరాబాద్ నుంచి ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు వచ్చే వారి కోసం ఏర్పాటు చేసిన బస్సుల్లో ప్రయాణికుల రద్దీ అధికంగానే ఉంటోంది. దీంతో ఈ బస్సులు జనంతో కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. వీటిలో 80 శాతానికి పైగా ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) ఉంటోంది. ఇది ఏపీఎస్‌ఆర్టీసీకి అదనపు ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. గత ఏడాదికంటే ఈ సంక్రాంతికి డిమాండ్ ఎంతో మెరుగ్గా ఉందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం అమలుతో అక్కడ బస్సులు స్థానికుల అవసరాలకే సరిపోతున్నాయని, మునుపటిలా ఆంధ్రప్రదేశ్ సహా ఇతర రాష్ట్రాలకు సంక్రాంతికి అదనంగా బస్సులు నడిపే పరిస్థితి లేదని ఓ ఆర్టీసీ అధికారి ‘సాక్షి’కి చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏపీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం హైదరాబాద్ నుంచి గతం కంటే ఎక్కువ సర్వీసులను నడుపుతూ ప్రయాణికుల అవసరాలు తీరుస్తోందని వివరించారు. ఇప్పటికే పలువురు బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్లు చేయించుకున్నారు.

సమన్వయానికి అధికారులు..

మరోవైపు హైదరాబాద్‌లో ఉత్తరాంధ్ర సహా ఆంధ్ర ప్రాంతానికి నడిపే ఏపీఎస్‌ఆర్టీసీ బస్సులను సమన్వయం చేయడానికి, ప్రయాణికులకు సహకరించడానికి యాజమాన్యం ప్రత్యేక అధికారులను నియమించింది. వివిధ స్థాయిల అధికారులు హైదరాబాద్‌లోని ప్రధాన జంక్షన్లలో ఉంటూ స్పెషల్ సర్వీసులను పర్యవేక్షిస్తున్నారు.

స్వచ్ఛతలో మెరిసిన యలమంచిలి IIలో

రాష్ట్ర స్థాయిలో 42వ ర్యాంకు



పురపాలకసంఘం కార్యాలయం

ఆస్తి కోసం అడ్డు తొలగించింది..

- మద్యంలో పురుగుమందు కలిపి భర్తకు తాగించిన భార్య
- పథకం ప్రకారం హత్య
- మృతుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు



విషాదంలో బంధువులు, కుటుంబ సభ్యులు



విచారణ చేస్తున్న సీఐ ఆనంద్‌బాబు



మృతదేహం



గోవింద్ (ఫైల్)

కశింకోట: ఆస్తి కోసం భర్తను అతి కిరాతకంగా ఓ భార్య హతమార్చడం స్థానికంగా సంచలనమైంది. శుక్రవారం రాత్రి మండలంలోని బయ్యవరంలో జరిగిన ఈ దారుణ సంఘటనకు సంబంధించి సీఐ ఆనందబాబు శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యవరం ఎస్సీ కాలనీకి చెందిన బరుకు గోవింద్ (43)కు యలమంచిలికి చెందిన శివలక్ష్మికి 2015లో వివాహమైంది. కుటుంబంలో ఆమెదే ఆధిపత్యం. విలాసవంతమైన జీవితాన్ని కోరుకునేది. పెళ్లయి ఎనిమిదేళ్లయినా సంతానం కలగలేదు. గోవింద్ భార్యను తరచూ అనుమానించడం వల్ల వారి మధ్య మనస్పర్థలు చోటుచేసుకోవడంతో తరచూ గొడవ పడుతుండేవారు. కుటుంబ సభ్యులు, పెద్దలు నచ్చజెప్పినా వారిలో మార్పు లేదు.

హతమార్చేందుకు పన్నాగం ఇలా..

ఉమ్మడి ఆస్తుల పంపకంలో గోవింద్‌కు దాఖలుపడిన పది సెంట్ల భూమిని అమ్మి నగదు ఇవ్వాలని, అప్పులు తీర్చాలంటూ భార్య శివలక్ష్మి తరచూ గొడవ పడుతుండేది. అయితే ఆ స్థలం జాతీయ రహదారి పక్కన ఉంది. ఎక్కువ ధర పలుకుతుండటంతో అమ్మేందుకు గోవింద్ మొగ్గుచూపలేదు. ఈ నేపథ్యంలో ఆస్తి కోసం గోవింద్‌ను అడ్డుతొలగించుకోవాలని భావించింది. ఈ నెల 5న భర్తతో మద్యం తాగించి కాళ్లు, చేతులు కట్టి ముఖంపై తలగడను పెట్టి ఊపిరి ఆడకుండా చేసి చంపేందుకు ప్రయత్నించింది. గోవింద్ అప్రమత్తం కావడంతో ఆ ప్రయత్నం విఫలమైంది. మరుసటి రోజు కూడా పీక నులిపి హత్యకు ప్రయత్నించగా భయపడిన గోవింద్ కుటుంబ సభ్యులు, బంధువులకు ఈ విషయం తెలిపాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఎప్పుడూ ఆదరించని తన అత్తను ఇంటికి పిలిచి శివ లక్ష్మి భోజనం పెట్టింది. అనంతరం నిద్రకు ఉపక్రమించారు. దీంతో తన పన్నాగాన్ని మళ్లీ భర్తపై ప్రయోగించింది. మద్యంలో పురుగుల మందు కలిపి భర్త గోవింద్‌కు తాగించడంతో మృతిచెందాడు. సాధారణ మృతిగా నమ్మించేందుకు ఆధారాలు కనిపించకుండా చేసింది. భర్త గోవింద్ ఎంత పిలిచినా లేవడం లేదని నిద్రలేపి అత్తకు తెలిపింది. అత్త నిద్ర మేల్కొని పరిశీలించింది. కుమారుడు విగతజీవిగా మారినట్టు గుర్తించింది. గత కొద్ది రోజులుగా జరుగుతున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకొని భార్య శివ లక్ష్మి హత్యచేసినట్టుగా ఆమె నిర్ధారణకు వచ్చింది. వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనకాపల్లి డీఎస్పీ సుబ్బరాజు, సీఐ ఆనంద్‌బాబు తమ సిబ్బందితో రంగంలోకి దిగి దర్యాప్తు జరిపారు. వేలి ముద్ర నిపుణులు, క్లూస్ బృందం వచ్చి ముద్రలు సేకరించారు. తల్లిని, కుటుంబ సభ్యులను, చుట్టు పక్కల వారితో పాటు శివ లక్ష్మిని విచారించారు. దీంతో ఆమె భర్తను హత్య చేసినట్లు విచారణలో నిర్ధారణ అయిందని సీఐ చెప్పారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆనంద్‌బాబు తెలిపారు.

క్లుప్తంగా

స్వచ్ఛతలో మెరిసిన యలమంచిలి

యలమంచిలి రూరల్: కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ,స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న స్వచ్ఛసర్వేక్షణ్‌–2023 పోటీల్లో యలమంచిలి పురపాలిక ముందడుగు వేసింది. రాష్ట్ర స్థాయిలో 42వ ర్యాంకు, జోనల్ స్థాయిలో 122వ ర్యాంకు, జాతీయ స్థాయిలో 1969వ ర్యాంకు సాధించింది. జనాభా ప్రాతిపదికన వివిధ స్థాయిల్లో ప్రకటించిన ర్యాంకుల్లో యలమంచిలి పురపాలిక గతేడాదితో పోల్చితే మెరుగైన ఫలితం సాధించింది. ఈ సందర్భంగా కమిషనర్ కొండలరావు మాట్లాడుతూ సమష్టి కృషితో మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే కన్నబాబు, చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి సహాయతో పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు.

రూ.10 లక్షలతో ఏలేరు కాలువపై ఐరన్ గ్రిల్స్

- విస్కో జేఈ నానాజీ

నాతవరం: ఏలేరు కాలువ గట్టుపై ప్రయాణించే వారికి ప్రమాదాలు జరగకుండా రూ.10లక్షల వ్యయంతో రెండు ప్రాంతాల్లో ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేశామని, మిగతా ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని విస్కో జేఈ నానాజీ తెలిపారు. ఎ.శరభవరరం, రాజుపేట అగ్రహారం గ్రామాల సమీపంలో ఏలేరు కాలువ గట్టుపై ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు పనులను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాకినాడ జిల్లా ఏలేశ్వరం ప్రాజెక్టు నుంచి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు నీటిని కాలువ ద్వారా తరలిస్తున్నారని, ఉమ్మడి రెండు జిల్లాల పరిధిలో సుమారు 154 కిలో మీటర్ల పొడవున ఏలేరు కాలువ ప్రవహిస్తోందని తెలిపారు. మధ్యలో చాలా గ్రామాల ప్రజలు కాలువ గట్టుపై రాకపోకలు సాగిస్తున్నారని చెప్పారు. రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎం.బి. పట్నం పంచాయతీ శివారు ఎ.శరభవరం వద్ద, రాజుపేట అగ్రహారం వద్ద గ్రిల్స్ ఏర్పాటు పనులు పూర్తికావచ్చాయని, ఏలేరు కాలువ పొడవునా ప్రమాదకరంగా ఉన్న మిగతా ప్రాంతాల్లో కూడా గ్రిల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని చెప్పారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న ఏలేరు కాలువ గట్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు.

600 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



ఖాళీ డ్రమ్ములతో ఎస్ఐ రమేష్

కె.కోటపాడు: కొరువాడ శివారు మామిడితోటలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లం పులుపును ఎ.కోడూరు పోలీసులు ధ్వంసం చేశారు. ఎస్ఐ రమేష్ శనివారం రాత్రి సిబ్బందితో కలిసి వెళ్లి తనిఖీ చేశారు. వంట పాత్రలతో పాటు డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 600 లీటర్ల పులుపును గుర్తించారు. బెల్లం పులుపును ధ్వంసం చేసి వంట పాత్రలను స్వాధీనం చేసుకున్నారు.

పండగలా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

- ఆరు అభివృద్ధి పనులను
- ప్రారంభించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



కూర్మానాథపురం రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మండలంలో పలు అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శనివారం పండగ వాతావరణంలో ప్రారంభోత్సవం చేశారు. దేవరాపల్లి, వేచలం గ్రామాల్లో రూ. 2.32 కోట్లతో పూర్తి చేసిన ఆరు అభివృద్ధి పనుల శిలాఫలకాలు ఆవిష్కరించి, ప్రారంభించారు. వేచలంలో రూ. 43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ. 20.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకే, దేవరాపల్లిలో దేవరాపల్లి, చిననందిపల్లి రోడ్డు నుంచి చేనుపాలెం వరకు రూ. 1.21 కోట్లతోనూ, సంతతోట నుంచి రెల్లిపేట వరకు రూ. 13.30 లక్షలతోనూ సీసీ రోడ్డును, రూ. 20 లక్షలతోనూ అంతర్గత సీసీ రోడ్డును, కొల్లి వారి కల్లాలకు రూ. 14 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. వేచలం, దేవరాపల్లి, ఎస్.జి. నగరం సర్పంచ్‌లు నాగిరెడ్డి శతారినాయుడు, సబ్బవరపు పెంటమ్మ, చిరికి లక్ష్మి పాల్గొన్నారు.

రూ. 6.30 కోట్లతో నాలుగు రోడ్లు ప్రారంభం

మాడుగుల రూరల్: మండలంలో శంకరం, తాటిపర్తి గిరిజన పంచాయతీ పరిధిలో రూ.6.30 కోట్లతో నిర్మించిన నాలుగు రోడ్లను శనివారం సాయంత్రం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. శంకరం పంచాయతీ శివారు రామచంద్రపురం నుంచి బొడ్డరేవు పోవు రహదారికి రూ.1.10 కోట్లు, శంకరం రహదారి నుంచి లక్ష్మీంపేట రహదారికి రూ.80 లక్షలు, పాడేరు రహదారి నుంచి బిళ్లలుపాలెం రహదారికి రూ.1.20 కోట్లు, కూర్మానాథపురం నుంచి ద్వారకానగర్ రహదారికి రూ.3.20 కోట్లు చొప్పున మంజూరు చేసి నిర్మించారు. అనంతరం తాటిపర్తి శివారు ద్వారకానగర్‌లో యువకలకు క్రీడా సామగ్రిని, బిళ్లలుపాలెంలో చిన్నారులకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, మండల సచివాలయాల కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు శోలం రమేష్, అల్లంగి వెంకట గౌరీదేవి, గొల్లవిల్లి సంజీవిరావు, ఏఎంసీ డైరెక్టర్లు శీరా సన్నెమ్మ, భీశెట్టి జగ్గప్పారావు, దొండా నాగమణి, నందారపు సత్యనారాయణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్, నాయకులు పడాల అప్పలనాయుడు, చింతా మూర్తి పాల్గొన్నారు.



దేవరాపల్లిలో సంతతోట – రెల్లివీధి సీసీరోడ్డు శిలాఫలకం ప్రారంభం

అస్థికలు కలిపి వస్తూ అనంత లోకాలకు..

- తాళ్లపాలెం వద్ద రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి
- నలుగురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో మృతి చెందిన ఈతపల్లి భాస్కరరావు



ప్రమాద స్థలంలో క్షతగాత్రుడు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వద్ద కారు బోల్తా పడి ఒకరు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. గోదావరి నదిలో అస్థికలు కలిపి తిరిగి ఇంటికి వస్తుండగా శనివారం ప్రమాదం జరిగింది. సీఐ ఆనందబాబు అందించిన వివరాల ప్రకారం.. పరవాడ మండలం అగనంపూడికి చెందిన ఈతపల్లి నారాయణరావు ఇటీవల మృతి చెందారు. దీంతో సంప్రదాయంగా ఆయన అస్థికలు గోదావరిలో కలపడానికి ఆయన కుమారులు ఈతపల్లి భాస్కరరావు(28), వాసుదేవరావు బంధువులతో కలిసి రాజమహేంద్రవరం వెళ్లారు. అక్కడ గోదావరి నదిలో అస్థికలు కలిపిన అనంతరం కారులో అగనంపూడి ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో తాళ్లపాలెం వద్ద జాతీయ రహదారి వంతెన సమీపంలోకి వచ్చేసరికి రోడ్డు పక్కన రక్షణగా వేసిన రెయిలింగ్ స్తంభాన్ని ఢీకొట్టి పక్కనున్న పొలాల వైపు బోల్తా పడి పల్టీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న భాస్కరరావు(28), వాసుదేవరావు, బంధువులు ఈతపల్లి గణేష్, మురళీగణేష్, రెడ్డిబోయిన వెంకటరావు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని జాతీయ రహదారి వాహనంలో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ భాస్కరరావు మృతి చెందారు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. మృతుడు భాస్కరరావు పరవాడ ఫార్మాసిటీలోని ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. అతని మృతితో కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

వెయ్యి లీటర్ల పులుపు, సామగ్రి ధ్వంసం



డమ్ములను తగులబెడుతున్న పోలీసులు

రావికమతం: అంట్లంపాలెం గ్రామ శివారు తోటల్లో సారా తయారు చేస్తున్న కేంద్రంపై కొత్తకోట పోలీసులు శనివారం దాడులు చేశారు. ముందస్తు సమాచారం అందడంతో ఎస్ఐ లక్ష్మణరావు సిబ్బందితో కలిసి ఆ గ్రామ శివారు తోటల్లో దాడులు చేశారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న వెయ్యి లీటర్ల పులుపు, సారా తయారీకి ఉపయోగించే డ్రమ్ములను, పరికరాలను ధ్వంసం చేశారు.

జూ పార్కు తెరిచే ఉంటుంది

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కును సోమవారం తెరవనున్నట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా శనివారం ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి సందర్భంగా సందర్శకుల సౌకర్యార్థం జూ పార్కును తెరవనున్నామన్నారు. దీనికి బదులుగా మంగళవారం జూ పార్కు మూసేస్తామన్నారు.

ముగ్గురు మహిళలకు సీఎం సహాయ నిధి

- రూ. 5 లక్షల చొప్పున మంజూరు
- చెక్కులు అందజేసిన డిప్యూటీ సీఎం


మాడుగుల రూరల్: మండలంలో ముగ్గురు మహిళలకు సీఎం సహాయ నిధి నుంచి రూ.5 చొప్పున ఆర్థిక సాయం మంజూరైంది. అవురువాడ పంచాయతీ ద్వారకానగర్‌లో ఆ చెక్కులను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శనివారం అందజేశారు. గత ఏడాది నవంబర్ 2న మాడుగుల మండలం ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో జరిగిన సాధికార సామాజిక బస్సుయాత్రకు వచ్చిన అవురువాడ పంచాయతీ శివారు పెద గొర్రిగెడ్డకు చెందిన కొప్పుల దేముడమ్మ, బిందున లక్ష్మి, కిలంబోయిన రాజులమ్మ తిరిగి ప్రయాణంలో అవురువాడ శివారు సంగ్యాం సాయిబాబా గుడి వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వీరికి అప్పట్లో వైఎస్సార్‌సీపీ నుంచి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేయగా, తాజాగా ప్రభుత్వం ఒక్కొక్కరికీ రూ 5 లక్షల చొప్పున అందజేసింది. ఈ సందర్భంగా బాధితులు ముగ్గురు సీఎం జగన్‌మోహన్ రెడ్డికి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీ రాజారామ్, అవురువాడ గ్రామ సర్పంచ్ కిముడు మోద హైందవ గుప్తేశ్వరి, మాజీ సర్పంచ్ కిముడు త్రిమూర్తులు, ఎంపీటీసీ చదల కృష్ణందొర, గ్రామ వెలుగు సీసీ అప్పలనాయుడు, సీఏ రావాడ కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కులు అందజేస్తున్న డిప్యూటీ సీఎం

కన్నీటి గాథ.. నాటకానికి కథ

- పుట్టింట, మెట్టింట బాల సన్యాసమ్మకు కష్టాలు
- అగ్నిగుండంలో దూకి ప్రాణత్యాగం
- పేరంటాలుగా పూజలందుకుంటున్న వైనం
- నేడు దిమిలిలో ప్రదర్శన



కట్టుబోలులో బాలసన్యాసమ్మ అమ్మవారు

రాంబిల్లి: ఆమె పుట్టింట ధనవంతురాలు. బోలెడంత ఆస్తి, సారె, లాంఛనాలతో వచ్చి మేనమామను పెళ్లాడింది. తల్లి చిన్నప్పుడే చనిపోయింది. సవతి తల్లి నానా కష్టాలు పెట్టడంతో పుట్టింట ఇబ్బందులు పడింది. మెట్టింట భర్త దేశభక్తితో సిపాయిగా పనిచేయడంతో అత్త, తోటికోడళ్ల ఆరళ్లతో విసిగిపోయి అగ్నిగుండంలో దూకి ప్రాణత్యాగం చేసింది.. ఆమే బాల సన్యాసమ్మ. అత్తవారి గ్రామమైన కట్టుబోలులో ఆమె పేరంటాలు అమ్మవారిగా పూజలందుకుంటోంది. కనుమ రోజున ఈ గ్రామంలో భారీస్థాయిలో తీర్థాన్ని నిర్వహిస్తారు.

బాలసన్యాసమ్మ యథార్థ గాథ

ధర్మవరానికి చెందిన దాలినాయుడు కుమార్తె బాల సన్యాసమ్మను కట్టుబోలు గ్రామానికి చెందిన తన సోదరి కుమారుడు చెంచెన్నతో వివాహం జరిపించారు. ఆ సమయంలో ఎంతో ఆస్తి, సారె సమర్పించారు. భర్త చెంచెన్న దేశభక్తిపై మమకారంతో సిపాయిగా సేవలందించేవారు. సవితి తల్లితో పుట్టింట కష్టాలు పడిన బాలసన్యాసమ్మ అత్త దాలమ్మ, తోటికోడలు లక్ష్మి అష్టకష్టాలు పెట్టేవారు. వరకట్నం కోసం అత్త తరచూ వేధించేవారు. అత్త పెట్టే కష్టాలు చెబుతామంటే, దేశసేవ నుంచి ఉద్యోగం మానేసి వచ్చేస్తారని భర్తకు చెప్పలేకపోయేది. బాలసన్యాసమ్మకు దేశంపై మమకారం ఉండేది. దీంతో దేశ సేవకు తన భర్త దూరం కావడం ఇష్టం లేకపోయింది. చివరికి అగ్నిగుండంలో దూకి ప్రాణత్యాగం చేసింది. తర్వాత ఈ గ్రామంలో ఆమె అమ్మవారిగా వెలిశారు. గ్రామస్తులు ఆలయాన్ని నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దశాబ్దాలుగా పూజలందుకుంటున్నారు.





బాల సన్యాసమ్మ నాటకంలో దృశ్యాలు

కనుమ రోజున కట్టుబోలులో భారీ తీర్థం

దిమిలికి చెందిన వానపల్లి నూకాచారి బాల సన్యాసమ్మ కథను రచించారు. ఇదే గ్రామానికి చెందిన రిటైర్డు హెచ్‌ఎం కోవెల వెంకటరావు హీరోగా తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా ప్రదర్శిస్తున్నారు. భోగి రోజున సంతోషిమాత తీర్థం సందర్భంగా ఆదివారం దిమిలిలో ఈ నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు. అదేవిధంగా కనుమ రోజు కట్టుబోలులో అమ్మవారి తీర్థ మహోత్సవానికి పలు ప్రాంతాల నుంచి వేలాదిగా జనం తరలివస్తారు.

ఎంతో ప్రజాదరణ



బాల సన్యాసమ్మ యదార్థ గాథ నాటక రూపంలో ప్రదర్శిస్తున్నాం. తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో ప్రదర్శిస్తున్నాం. బాలసన్యాసమ్మ కథనం ఎంతో ఆసక్తికరంగా ఉండటంతో ప్రేక్షకులు ఎంతోగానో ఆదరిస్తున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా బాల సన్యాసమ్మ పూజలందుకుంటున్నారు.

–కోవెల వెంకటరావు, రిటైర్డు హెచ్‌ఎం (నాటకంలో హీరో)

అనకాపల్లిలో విద్యుత్తు వెలుగులు

- రూ.85 లక్షలతో సెంటర్ విద్యుత్ లైట్లు ప్రారంభం



విద్యుత్‌లైట్లకు బటన్‌నొక్కి ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి

అనకాపల్లి: అనకాపల్లిని అందాలపల్లిగా చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చామని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. శనివారం రాత్రి స్థానిక సుంకరమెట్ట కూడలి వద్ద రూ.85 లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌కు సంబంధించి శిలాఫలకాన్ని, స్విచ్ ఆన్ చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన అనకాపల్లి ముఖద్వారాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. రహదారిని వెడల్పు చేసి డబుల్‌రోడ్డుగా అభివృద్ధి చేసి సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయించామన్నారు. జాతీయ రహదారి చేరుకోవాలంటే గత ప్రభుత్వ హయాంలో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పయనించాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుత పాలనలో ఎక్కడికక్కడ లైటింగ్ సదుపాయం, రహదారులు అభివృద్ధి చేశామన్నారు. ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ సెంటర్ లైటింగ్ మధ్యభాగంలో పర్యావరణ పరిరక్షణకు కావల్సిన మొక్కలను నాటారని, వీటితో పరిశుభ్రమైన వాతావరణం, స్వచ్ఛమైన గాలి లభించనుందన్నారు. జాతీయ రహదారి నుంచి శారదా బ్రిడ్జి వరకు రహదారి పనులు త్వరలో పూర్తి కానున్నాయన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్తలు మలసాల భరత్‌కుమార్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మీ, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొడ్డేడ శివ, దేవస్థానాల చైర్మన్లు కె.ఎం.నాయుడు, కొణతాల మురళీకృష్ణ, ఆళ్ల నాగేశ్వరరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గోదా కల్యాణోత్సవానికి సన్నాహాలు



కల్యాణోత్సవం నిర్వహించనున్న ఉత్సవ విగ్రహాలు

కశింకోట : స్థానిక రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో భోగి పండగను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం గోదాదేవి (ఆండాళమ్మ) కల్యాణోత్సవం నిర్వహించడానికి సన్నాహాలు చేశామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు తెలిపారు. 15న సంక్రాంతిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, విష్ణు సహస్ర నామార్చన జరుగుతాయన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

అనకాపల్లి : అమరజీవి పొట్టిశ్రీరాములు పవిత్రస్మృతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం భోగి పండగను పురస్కరించుకుని పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సాంప్రదాయ పద్ధతిలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ వ్యవస్థాపకుడు పీరట్ల నరసింహమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలిపొందిన విజేతలకు ఈనెల 15న బహుమతులు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉత్సవానికి ఏర్పాట్లు



విద్యుత్ సెట్టింగ్ కోసం సర్వే కర్రలతో ఏర్పాటు చేసిన ముఖద్వారం

అనకాపల్లి : స్థానిక వేల్పుల వీధిలో వేంచేసిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవానికి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 20న జరిగే ఉత్సవానికి విద్యుత్ సెట్టింగ్ కోసం ముఖద్వారం, విద్యుత్ తోరణాల కోసం సర్వే కర్రలు పట్టణంలో ఏర్పాటు చేశారు. ఉత్సవం రోజున అమ్మవారి ఆలయానికి వేలాది సంఖ్యలో భక్తులు హాజరు కానున్నారు. ఆరోజు సాయంత్రం నేల వేషాలతో పాటు స్టేజీ కార్యక్రమాలు, బాణసంచా విన్యాసాలకు అన్నీ సిద్ధమయ్యాయి.

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం	: రాజా
గుంటూరు కారం	: సత్యనారాయణస్క్రీన్-1
హనుమాన్	: సత్యనారాయణస్క్రీన్-2
నా సామిరంగ	: షిర్డిసాయి
సైంధవ్	: పర్తిసాయి
గుంటూరు కారం (రెండుషోలు)	
సలార్ (రెండుషోలు)	: వెంకటేశ్వర
తికమక తాండ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 6,920 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,550	4,570
మొదటి రకం	3,610	4,140
రెండో రకం	3,530	3,870
మూడోరకం	3,360	3,520

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 46 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-16 యూనిట్లు, ఓ పాజిటివ్-16 యూనిట్లు, ఏబీ పాజిటివ్-8 యూనిట్లు, ఓ నెగిటివ్-3 యూనిట్లు, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదింవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 526 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 481 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



పాలిథిన్ పేపర్లతో తయారు చేసిన రంగుల గాలిపటాలు

పతంగుల సందడి





కశింకోటలో విక్రయిస్తున్న గాలి పటాలు, గాలి పటాన్ని ఎగుర వేయడానికి కొనుగోలు చేసిన చిన్నారి

కశింకోట : కశింకోటలో గాలి పటాలు(పతంగులు) అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా యువకులు వీటి కొనుగోలు పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. సంక్రాంతి రోజుల్లో గాలి పటాలను పిల్లలు తమ ఇళ్ల వద్ద ఎగుర వేస్తుంటారు. రంగుల కాగితాలు, పాలిథిన్ పేపర్లతో అందంగా తయారు చేసిన దారం సహాయంతో గాలి పటాలను ఎగుర వేస్తుంటారు.

గాలి ఒత్తిడిని తట్టుకునే పాలిథిన్ పేపర్లతో తయారు చేసిన గాలి పటాల పట్ల యువత, చిన్నారులు ఆసక్తి చూపుతుండడంతో వాటి విక్రయాల పట్ల వ్యాపారులు దృష్టి నిలిపారు. వీటిని పరిమాణం, తయారీకి వినియోగించిన పేపర్, డిజైన్‌లను అనుసరించి రూ.10 నుంచి రూ.500 వరకు వివిధ రూపాల్లో తయారు చేసి విక్రయాలు జరుపుతున్నారు. వీటిలో అందుబాటులో రూ.10 నుంచి రూ.30 వరకు ధర ఉన్న వాటిని యువకులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా పోటీ పడి పతంగులు ఎగుర వేయడానికి యువత ఉత్సాహం చూపుతున్నారు.

పట్టణానికి పండగ శోభ

అనకాపల్లి : పట్టణం సంక్రాంతి శోభ సంతరించుకుంది. స్థానికంగా ఉన్న వస్త్ర దుకాణాలకు ప్రజలు పోటెత్తారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లి చుట్టుపక్కలున్న గ్రామాల నుంచి గ్రామస్తుల రాకతో ప్రధాన రహదారితో పాటు చిన నాలుగు రోడ్ల కూడలి, రింగ్‌రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ దారులు కళకళలాడాయి. అన్ని వర్గాల వారు రెడీమేడ్ షాపుల బాట పట్టడంతో షాపులన్నీ కిక్కిరిసిపోయాయి. చిన్నారుల వస్త్రాలకు పలు దుకాణాలు ఆఫర్లు పెట్టడంతో నూతన వస్త్రాల కొనుగోలుకు దుకాణాల వద్ద జనం బారులుతీరారు.



ప్రధాన రహదారిలో కిటకిటలాడుతున్న ఒక షాపింగ్‌మాల్

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని రక్షించిన 104 సిబ్బంది

నర్సీపట్నం: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని 104 వైద్య సిబ్బంది రక్షించారు. వైద్య సిబ్బంది అందించిన వివరాలు ప్రకారం....నర్సీపట్నం మండలం, కొత్తలక్ష్మీపురంలో ఎస్.జగదీష్(25) అనే యువకుడు కుటుంబ సభ్యుల మధ్య ఏర్పడిన మనస్పర్థలతో ఇంట్లో శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. అదే సమయంలో గ్రామంలో 104 సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జగదీష్ ఆత్మహత్యకు యత్నించడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు లబోదిబోమనడంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులుబద్దలు కొట్టి ఉరి వేసుకున్న జగదీష్‌ను బయటకు తీసుకువచ్చారు. కొన ఊపిరితో ఉన్న జగదీష్‌కు 104 శిబిరంలో ఉన్న డాక్టర్ అనుషా, సిబ్బంది అత్యవసర వైద్య సేవలు అందించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలో జగదీష్ చికిత్స పొందుతున్నాడు. 104 డివిజన్ ఇన్‌చార్జి కె.అప్పారావు ఆస్పత్రికి వెళ్లి జగదీష్ ఆరోగ్యంపై ఆరా తీశారు.



జగదీష్‌ను పరామర్శించిన 104 డివిజన్ ఇన్‌చార్జి అప్పారావు

రైతులకు స్టీల్ పాల క్యాన్లు అందజేత

అనకాపల్లి : అమూల్ పాల ఉత్పత్తి రోజు రోజుకు గణనీయంగా పెరుగుతోందని ఏపీఐడబ్ల్యుఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. తుమ్మపాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు అధ్యక్షతన 13 మంది అమూల్ రైతులకు 130 స్టీల్ పాల క్యాన్లు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రస్తుతం 700 లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. ప్రభుత్వం రైతులకు రూ.30 నుంచి రూ.90 వేల రుణ సదుపాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పన్నీరు వెంకటలక్ష్మి, డెయిరీ అధ్యక్షురాలు పడాల శారద, వైఎస్సార్‌సీపీ నేత పడాల గణపతి, వార్డు మెంబర్లు సత్యారావు, మోదినాయుడు, డెయిరీ సిబ్బంది పాల్గొన్నారు.

కోడి పందాలపై పోలీసుల దాడి

రోలుగుంట : మండలంలో కోడి పందాలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి స్థానిక ఎస్ఐ ఎల్.సురేష్ దాడులు చేశారు. ఈ దాడుల్లో దిబ్బల పాలెం పొలాల్లో నిర్వహిస్తున్న కోడి పందాలపై దాడి చేసి 13 మంది పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి అయిదు కోడి పుంజులు, రూ. 3,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

రైతు నాయకుల నిరసన

అనకాపల్లి : భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలంటూ రైతునాయకులు స్థానిక నెహ్రూచౌక్‌లో శనివారం నిరసన చేపట్టారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా ప్రజా ప్రయోజనాల కంటే ప్రజల ఆస్తిపై హక్కుకు భంగం ఏర్పడే ప్రమాదముందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, నాయిని బాబు, కోరుబిల్లి శంకరరావు, రంగారావు, వైఎస్ భద్రం పాల్గొన్నారు.

సందడి చేసిన పూర్వ విద్యార్థులు



1976-77 టెన్త్ విద్యార్థులు

అనకాపల్లి : పూర్వ విద్యార్థులంతా ఉన్నత స్థానాల్లో స్థిరపడడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థి సంఘం కన్వీనర్ కాండ్రేగుల దుర్గాప్రసాద్ అన్నారు. జీవీఎంసీ హైస్కూల్లో 1976-77లో టెన్త్ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు స్కూల్ ఆవరణలో శనివారం కలుసుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పిల్లల భవిష్యత్‌ను కూడా తీర్చిదిద్ది, వారికి బంగారుబాట వేయాలని సూచించారు. అంతకు ముందు వారంతా ఆప్యాయంగా పలికరించుకుని చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. వారంతా మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. సంఘ కో కన్వీనర్ కాండ్రేగుల సత్యనారాయణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు విశ్రాంత డీపీఎంవో వితరణ

మునగపాక : ఏటా గ్రామంలోని పారిశుధ్యం మెరుగుపరుస్తున్న పారిశుధ్య కార్మికులకు తనవంతు సాయంగా విశ్రాంత డీపీఎంవో ఆడారి సన్యాసిరావు దుస్తులు అందజేశారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదినం సందర్భంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తుంటారు. ఈ ఏడాది కూడా శనివారం మునగపాక పంచాయతీ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు తనవంతు సాయంగా వస్త్రాలు అందజేసి ఔదార్యం చాటుకున్నారు.

సంప్రదాయ డోలిక..
ఆనందాల వేడుక

- నేటి నుంచి సంక్రాంతి సంబరాలు
- బంధుమిత్రులతో కళకళలాడుతున్న తెలుగు లోగిళ్లు
- నేడు భోగభాగ్యాల భోగి



డూడూ బసవన్న అంటూ ఇళ్ల వద్ద సందడి చేస్తున్న గంగిరెద్దు కులస్తులు



యలమంచిలిలో కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న ప్రధాన రహదారి

యలమంచిలి రూరల్ : గంగిరెద్దులు..గొబ్బెమ్మ పాటలు..రంగవల్లులు..హరిదాసు కీర్తనలు..బుడబుడక్కల చప్పుళ్లు..అత్తారింట కొత్త అల్లుళ్లు..కొంటె మరదళ్ల సందళ్లు..పిండివంటల ఘుమఘుమలు..అబ్బో.!జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి శోభ ఉట్టిపడుతోంది. మూడురోజుల పండుగను వైభవంగా జరుపుకునేందుకు ప్రజానీకం సిద్ధమైంది.ఇప్పటికే సంక్రాంతికి కావాల్సిన సరంజామాను సమకూర్చుకుని మూడురోజుల పండగ ముచ్చటైన పండుగను చేసుకునేందుకు అంతా సిద్ధమయ్యారు.

కొత్త సంవత్సరంలో తొలిసారిగా వచ్చే పెద్ద పండుగ సంక్రాంతి. మూడు రోజుల ఈ పండుగ నిర్వహణలో ప్రత్యేకత ఉంది. ఈ పండగ పూర్తిగా పల్లెటూరి సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. సంక్రాంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు స్థానికులు సిద్ధమయ్యారు. ముఖ్యంగా భోగి, కనుమ మధ్యలో వచ్చే సంక్రాంతి పెద్ద పండగ మాత్రమే కాదు పెద్దల పండుగ కూడా. మొదటి రోజు అంటే ఆదివారం వేకువజాము భోగి మంటలు వేసుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇళ్ల ముందు కళ్లాపి చల్లి ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టడం, రెండో రోజు పెద్దల పండుగగా పితృదేవతలకు సమర్పణలు చేయడం, మూడో రోజు పాడిపంటలనిచ్చే పశువులకు పూజలు చేసి గ్రామ వాసుల జీవితంలో మమేకమైన పశుసంపదను గౌరవించి, ఆరాధించడం సంప్రదాయంగా వస్తోంది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం, చోడవరం, పాయకరావుపేట, అచ్యుతాపురం సహా అన్ని మండల కేంద్రాల్లో వస్త్ర దుకాణాలు, మార్కెట్లు కునుగోలుదారులతో కిటకిటలాడాయి. ఇతర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వచ్చే బంధుమిత్రుల రాకతో బస్సులు, రైళ్లతో పాటు ప్రయాణ ప్రాంగణాలన్నీ శనివారం రద్దీగా కనిపించాయి.



హరిదాసు సందడి

భోగి మంటలకు ఏర్పాట్లు

మునగపాక : మండల వ్యాప్తంగా ఆదివారం భోగి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పొలాల్లోని చెరకు చెత్తతో పాటు కలపను పోగు చేసి పందిర్లు ఏర్పాటు చేశారు. యువకులు ఈ భోగి పండగను ఉత్సాహంగా నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకున్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

- వాలీబాల్ విజేత నాగవరం జట్టు
- క్రికెట్ విజేత పాటిపల్లి

మునగపాక : మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి క్రీడాకారుల నుంచి విశేష స్పందన కనిపించింది. సచివాలయాల పరిధిలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారిని మండల స్థాయికి ఎంపిక చేశారు. మండల స్థాయి ప్రతిభ చూపిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్ పోటీల్లో నాగవరం జట్టు విజేతగా నిలిచి నియోజకవర్గ స్థాయికి ఎంపికైంది. ఈ మేరకు మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టీ షర్ట్స్ కొనుగోలుకు రూ.6వేల సాయం అందజేశారు. పాటిపల్లిలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో పాటిపల్లి జట్టు విజేతగా నిలిచి నియోజకవర్గ స్థాయికి ఎంపికైంది. క్రీడాకారులను పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు పరిచయడం చేసుకొని నియోజకవర్గ స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.



వాలీబాల్ విజేతకు రూ.6వేల సాయం అందజేస్తున్న మాజీ ఎంపీపీ గౌరీలక్ష్మి అప్పారావు

లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కశింకోట: కశింకోటలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆది, సోమవారాల్లో భోగి, సంక్రాంతి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి తెలిపారు. ఈ అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామ ప్రధాన వీధుల్లో రథంపై ఊరేగించనున్నట్లు తెలిపారు. అలాగే సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి(శివాలయం)లో ఈ నెల 15న సంక్రాంతి పురస్కరించుకొని స్వామి వారలను గ్రామంలో పల్లకిలో ఊరేగించనున్నట్లు ఆలయ అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణ తెలిపారు.



కశింకోటలో వెలసి ఉన్న లక్ష్మీనృసింహస్వామి

ఇజ్రాయిల్ దాడులపై జనసాహితి నిరసన

అనకాపల్లి : ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని జనసాహితీ జిల్లా అధ్యక్షుడు శివాజీరావు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం ఇజ్రాయిల్ దాడులకు జనసాహితీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మూడు నెలలుగా గాజా, వెస్ట్‌బ్యాంకుల్లో ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల కారణంగా వేలాదిమంది పిల్లలు, పౌరులు మరణించారని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. అంతకుముందు పట్టణంలో రామచంద్ర థియేటర్ నుంచి నెహ్రూచౌక్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు జగదీష్, పెంటాద్రిరావు, శాస్త్రి, రంగబాబు, ప్రసాద్, శ్రీను, బలరాం పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న శివాజీరావు

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు భారీగా తరలి రావాలి

కశింకోట : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల భారీ కాంశ్య విగ్రహాన్ని విజయవాడలో ఈ నెల 19న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్న కార్యక్రమానికి అధిక సంఖ్యలో జిల్లా ప్రజలు తరలి వచ్చి విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు కోరారు. కశింకోటలోని తన నివాసంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ ఏ ఒక్క వర్గానికో చెందిన వారు కాదని, అందరివారన్నారు. కశింకోట గ్రామంలో ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద జాతీయ రహదారి పక్కన ప్రముఖ తెలుగు చిత్రకారుడు వడ్డాది పాపయ్య విగ్రహాన్ని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా ఆవిష్కరించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు.



మళ్ల బుల్లిబాబు

ఉపాధ్యాయుల కృషితోనే విద్యార్థుల ఉన్నతి

అనకాపల్లి : విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. ఎంపీ కార్యాలయంలో శనివారం ప్రైమరీ స్కూల్స్ హెచ్ఎం అసోసియేషన్ ఆధ్వర్యంలో డైరీ, క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో పలు మార్పులు తీసుచ్చి విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసిందన్నారు. ప్రైమరీ స్కూళ్లలో విద్యనభ్యసించే చిన్నారులకు ఆటపాటల ద్వారా బోధన చేయడంతో వారికి సులువుగా పాఠాలు అర్థమవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కోవెల రవి, ప్రధాన కార్యదర్శి నేమాల రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లా బాబ్జీ పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి

నేడు ఉపమాకలో గోదా రంగనాథుల కల్యాణం

నక్కపల్లి : ధనుర్మాసం పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం గోదా రంగనాథుల కల్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. ఇందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఏర్పాట్లు చేశారు. గోదాదేవి శ్రీరంగనాథున్ని వివాహ మాడడం కోసం నెల రోజుల పాటు ధనుర్మాస వ్రతం ఆచరించింది. భోగి పండగతో ఈ వ్రతం పూర్తి కావడంతో శ్రీరంగనాథుడు గోదాదేవిని వివాహమాడడానికి అంగీకరించడంతో గోదా కల్యాణం భోగి పండగ నాడు నిర్వహిస్తారు. ఉపమాకలో స్వామివారి పుష్పతోటలో గోదారంగనాథుల కల్యాణం భోగినాడు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గోదాదేవి అమ్మవారిని నూతన వస్త్రాలంకరణలో అలంకరించారు. ఆదివారం ఉదయం కొండపై గల మూలవిరాట్ సన్నిధిలో నిత్యార్చనలు, అభిషేకాలు నిర్వహిస్తారు. కొండ దిగువన ఆండాళ్లమ్మ (గోదాదేవి) సన్నిధిలో నిత్య కార్యక్రమాలు అనంతరం గోదాదేవి అమ్మవారిని స్వామి వార్లను పల్లకిలో స్వామివారి పుష్పతోటలోకి తీసుకెళ్తారు. అక్కడ అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహిస్తామని ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. కల్యాణం అనంతరం స్వామి అమ్మవార్లకు రాజాధిరాజ వాహనంలో తిరువీధి సేవలు నిర్వహిస్తామన్నారు.



గోదాదేవి అమ్మవారు

ఎస్.రాయవరం : ధనుర్మాసోత్సవాలు పురస్కరించుకుని ఆదివారం వమ్మవరం శ్రీ స్వయంభూ వేంకటేశ్వరస్వామి, దార్లపూడి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, గుడివాడ శ్రీ వేంకటేశ్వరస్వామి, ఎస్.రాయవరం శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో గోదాదేవి కల్యాణం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. నెల రోజులుగా ఈ ఆలయాల్లో తిరుప్పావై పాశురాలు చదివి పూజలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈ ఆలయాల్లో గోదాదేవి కల్యాణాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

పండగలో జూదాలు నిషేధం

యలమంచిలి రూరల్ : సంక్రాంతి సమయంలో పట్టణాలు, గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నట్టు యలమంచిలి సీఐ షేక్ గఫూర్ చెప్పారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కోడి పందాలు, జూదం, గుండాట, అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కోడి పందాలు నిర్వహించడం, ఆడడం చట్టరీత్యా నేరమన్నారు. కోడి పందాలపై నిఘా పెట్టామని, గతంలో కోడి పందాలకు సంబంధించిన పాత కేసుల్లో ఉన్న వారి కదలికలపై గ్రామాల వారీగా నిఘా పెట్టామన్నారు. ఇప్పటికే అలాంటి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని గ్రామ పెద్దలకు సూచించామన్నారు. కోడి పందాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించామన్నారు. పండగ ముసుగులో కోడి కత్తులు కట్టి పందాలు నిర్వహించడం, గుండాట, జూద క్రీడలు, బరులను ఏర్పాటు చేసి అనుమతి లేకుండా మద్యం విక్రయించడం వంటివి చేస్తే కటకటాల్లో వేస్తామని హెచ్చరించారు. ప్రజలు అసాంఘిక కార్యక్రమాల గురించి తెలిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. కోడి పందాల కట్టడిలో ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు ఇళ్లలో విలువైన బంగారు, వెండి వస్తువులు, నగదు ఉంచరాదని సూచించారు. ఇళ్లకు తాళం వేసి వెళ్లేవారు సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే చోరీలు జరగకుండా నిఘా ఉంచుతామన్నారు. ఇప్పటికే ఈ విషయాలపై సర్కిల్ పరిధిలో పోలీస్‌స్టేషన్లలో ఎస్ఐలు, సిబ్బందిని అప్రమత్తం చేశామని చెప్పారు. ప్రజలంతా సంక్రాంతి పండగను సంప్రదాయబద్ధంగా ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.



షేక్ గఫూర్, సీఐ, యలమంచిలి

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ఎస్.రాయవరం : పేదోడికి సహాయం చేయడంలో కలిగే సంతృప్తి మరొకటి ఉండదని మునసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బంగారి చిట్టి అన్నారు. రేవు పోలవరం గ్రామంలో సంక్రాంతి వేడుకను పురస్కరించుకుని చలి కూడా బాగా ఎక్కువ ఉండడంతో సుమారు 80 మందికి వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మధ్య తరగతి కుటుంబంలో జీవిస్తున్న బంగారు చిట్టి చనిపోయిన తల్లి పేరున ఇటువంటి సేవ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చోడిపల్లి అనూరాధ గోవిందులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.